క్లుప్తంగా

భాకరాపేట ఎస్ఐగా రాఘవేంద్ర



భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట ఎస్ఐగా బి.రాఘవేంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు భద్రత కల్పించడంలో శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రాన్ని గురువారం సంయుక్త వ్యవసాయ సంచాలకులు, ఈ–పంట నోడల్ అధికారి విజయభారతి తనిఖీ చేశారు. ఈ–పంట నమోదు విధానాన్ని పరిశీలించారు. పంటల నమోదులో సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వాస్తవ సాగుదారుల వివరాలను మాత్రమే ఈ–పంటలో నమోదు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, డ్రిప్, స్ప్రింక్లర్ల నీటి పారుదల పద్ధతులను అనుసరించి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఈ–పంటలో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు స్రవంతి, హరిత, హరిత కుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం తమిళనాడు మంత్రి సీవీ గణేషన్, తెలంగాణ ఎమ్మెల్యేలు రంగారెడ్డి, సత్యనారాయణ రావు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా టీటీడీ అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

రామచంద్రాపురం: మండలంలోని సొరకాయలపాలెం పంచాయతీ కమ్మపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.300 గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఇప్పటివరకు 288 కుటుంబాలు 100 రోజుల పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. 2000 మందికి పైగా కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. ఏపీవో హంసవేణి పాల్గొన్నారు.

బెంచీల వితరణ



చంద్రగిరి: స్థానిక ఏరియా ఆస్పత్రికి గురువారం చంద్రగిరి కొత్తపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు జనార్థన్ రెడ్డి, విశాలాక్షి దంపతులు నాలుగు టేకు బెంచీలు వితరణ చేశారు. వాటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు అందజేశారు. వారు మాట్లాడుతూ రోగులు కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో సుమారు రూ.60 వేలలో నాణ్యమైన టేకు బెంచీలను అందించినట్లు తెలిపారు.

శాంతిరథం ప్రారంభం

తిరుపతి కల్చరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శాంతి రథాన్ని గురువారం రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, సామాజికవేత్త సైకం జయచంద్రారెడ్డి, తుడా ఈఈ ఎస్‌వీ.కృష్ణారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని వారి స్వస్థలం లేదా శ్మశానవాటికకు తీసుకు వెళ్లేందుకు శాంతి రథం పేరిట వాహనాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. మానవతా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సీవీ.రమణ, సుకుమార్‌రాజు మాట్లాడుతూ నగరంలో 10 కిలోమీటర్ల వరకు శాంతి రథాన్ని ఉచితంగా అందజేస్తామని, 10 కిలోమీటర్లు దాటితే ఇంధనానికి నగదు చెల్లించాలని తెలిపారు. సేవల కోసం 9441449525, 6281433397లో సంప్రదించాలని తెలియజేశారు. భార్గవ్, వేణుగోపాల్, గంగిరెడ్డి, భాస్కర్ రెడ్డి, కిరణ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గౌతమ్ పాల్గొన్నారు.

ల్యాబ్ పరికరాల వితరణ



తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.65 వేలు విలువైన ల్యాబ్ పరికరాలను గురువారం పూర్వ విద్యార్థులు అందజేశారు. ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ ఎస్‌వీ.గౌరీశంకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్లాంట్ ఫర్ మదర్

తిరుపతి సిటీ: తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో గురువారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని ఏడీఆర్ డాక్టర్ వి సుమతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఏక్ పేడ్ ఫర్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌ఏఆర్‌ఎస్‌లో మొక్కలు నాటామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేధింపుల నిరోధక కమిటీలు అవసరం



వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా వైద్యురాలి ఘటనలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తక్షణం అమలు చేయాలి. అలాగే వేధింపుల నిరోధక కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలి. వీటన్నింటితోపాటు జిల్లా స్థాయిలో అధికారులు, వైద్యాధికారులు, పోలీసు అధికారులు, జూనియర్ డాక్టర్లు, మహిళ వైద్యులతో ప్రతి ప్రభుత్వాస్పత్రిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా ఈ కమిటీ సమావేశమై డాక్టర్ల భద్రత సౌకర్యాలపై చర్చించి, వాటిని అమలు చేసేలా ఉండాలి. కోల్‌కతా లాంటి ఘటనలు ఇక పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకురావాలి. – డాక్టర్ విజయ్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నాగలాపురం



మనోధైర్యం కల్పించాలి



ఆస్పత్రుల్లో రాత్రింబవళ్లు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి భద్రత తప్పనిసరిగా కల్పించాలి. సుప్రీంకోర్టు సూచన మేరకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టి వైద్య సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి. ఆస్పత్రుల్లో సెక్యూరిటీ గార్డ్‌లను నియమించి, అనుమానాస్పద వ్యక్తులు, మద్యం సేవించిన వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో సంబంధిత పోలీస్ స్టేషన్లు, ఇతర హెల్ప్‌లైన్ నంబర్లు బోర్డుపై ఏర్పాటు చేయాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. – డాక్టర్ అరుణ్ కిషోర్, వైద్యాధికారి, నాగలాపురం పీహెచ్‌సీ

తెలుగు వారి ముద్దు బిడ్డ గిడుగు

తిరుపతి సిటీ: గిడుగు రామ్మూర్తి జీవితార్పణతోనే తెలుగు వ్యవహారిక భాషగా మారిందని, ఆయన తెలుగు ముద్దుబిడ్డగా తెలుగుజాతి కీర్తిస్తోందని ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు కొనియాడారు. ఎస్వీయూ ఓఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి, వేటూరి ప్రభాకరశాస్త్రి వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ రాజశేఖర్, వెంకటేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, పరిశోధకులు సంతోష్, యోగి, సోమలింగయ్య, హరికృష్ణ, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా పద్మావతి మహిళా వర్సిటీలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగపు అధ్యక్షురాలు కొలకలూరి మధుజ్యోతి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్వీడబ్ల్యూ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల్లో గురువారం తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు ఎం వేణుగోపాల్‌రెడ్డి, టి నారాయణమ్మ, బి సత్యనారాయణ పాల్గొన్నారు. ఎస్వీయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ రాజేశ్వరమ్మ తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని వివరించారు. అలాగే డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ ఆధ్వర్యంలో వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గిడుగు రామ్మూర్తి కృషిని కొనియాడారు.

పలు విద్యాసంస్థల్లో..

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి నగరంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ద్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష ఆవశ్యకత, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజ కవులు, రచయిత, రచయిత్రుల వేషధారణలో ఆకట్టుకున్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఘనంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర భాషోపాధ్యాయ జిల్లా అధ్యక్షుడు దొడ్డా ఉమామహేశ్వర్, హెచ్ఎం వాగ్దేవి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు కృషి చేసిన రాజులు, కవులు వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. జానపద గేయాలు, పద్య పఠనం, వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బ్లూమింగ్ బడ్స్‌లో..

చంద్రగిరి: పట్టణంలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు తల్లి, గిడుకు రామ్మూర్తి పంతులు, శ్రీకృష్ణ దేవరాయలు, వేమన వేషధారణలో అలరించారు. పాఠశాల చైర్మన్ బి.హితేంద్రనాథ్ మాట్లాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగును అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉండడంతో రామ్మూర్తి పంతులు అందరికీ అర్థమయ్యేలా సరళీకరణ చేశారని గుర్తు చేశారు. దేశంలో 22 అధికారిక భాషల్లో ఒకటిగా వెలుగొందుతున్న తెలుగు భాషకు మూలం ద్రావిడ భాష అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధికారిక భాష చట్టం ద్వారా 1966లో తెలుగు భాషను రాష్ట్ర అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అనంతరం ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.



గిడుగు రామ్మూర్తి, ప్రభాకరశాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేస్తున్న ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు



టీపీపీఎం ఉన్నత పాఠశాలలో తెలుగు అక్షరమాల ఆకృతిలో విద్యార్థినులు

పాకాలలో..

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో గురువారం జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్ట ర్ మొహిద్దీన్‌బాషా, హెచ్ఎం రఫీ మాట్లాడుతూ తెలుగు భా షా, సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవన్నారు. విద్యార్థులు క్రీ డల పట్ల మక్కువ పెంచుకోవాలనిసూచించారు. ఎస్ఎంసీ చైర్మన్ మునిప్రభాకర్ పాల్గొన్నారు.



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో బహుమతుల ప్రదానం



చంద్రగిరి : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న యాజమాన్యం



రచయితలు, రచయిత్రుల వేషధారణలో భాష్యం విద్యార్థులు

శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన వేటూరి



వేటూరి ప్రభాకరశాస్త్రి విగ్రహానికి పూలమాల వేస్తున్న వేటూరి పీఠం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారిపై అన్నమయ్య రచించిన సంకీర్తలను అనువదించి శ్రీవేంకటేశ్వర స్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు వేటూరి ప్రభాకరశాస్త్రి అని ఎస్వీయూ తెలుగు విశ్రాంత ఆచార్యుడు సర్వోత్తమరావు తెలిపారు. వేటూరి ప్రభాకరశాస్త్రి వర్ధంతిని గురువారం అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. వేటూరి ప్రభాకర శాస్త్రి మిత్ర మండలి వేణుగోపాల్, ఎస్వీయూ తెలుగు విశ్రాంత ఆచార్యు లు కట్టమంచి మహాలక్ష్మి, ప్రచురణల విభాగం ఉప సంపాదకుడు నరసింహాచార్యులు మాట్లాడుతూ ఆంధ్ర వాఙ్మయ విస్తృతికి వేటూరి ఎంతో కృషి చేశారని తెలిపారు. శ్వేత భవనం ఎదురుగానున్న వేటూరి ప్రభాకరశాస్త్రి కాంస్య విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సూపరింటెండెంట్ కుమార్, లోకనాథ రెడ్డి, హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోకిల పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం ముందు కుటుంబం ఆత్మహత్యాయత్నం

తిరుపతి క్రైమ్: తిరుపతిలోని ఎస్పీ కార్యాలయం ముందు గురువారం కుటుంబం ఆత్మహత్యకు యత్నించింది. పిచ్చాటూరుకు చెందిన మునస్వామి, జ్యోతి దంపతుల పిల్లలు నింద్ర– పిచ్చాటూరు మధ్య ఉన్న హైవేలో కూల్ డ్రింక్ షాప్ నిర్వహించేవారు. ఏడాది నుంచి అద్దె కట్టకపోవడంతో స్థల యజమాని చాంద్ బాషా గొడవ పడుతున్నాడు. పోలీసులు సైతం అద్దె కట్టాలని వీరికి సూచించారు. వారు అద్దె కట్టలేదు. చాంద్‌బాషాకు అప్పులు ఎక్కువ కావడంతో స్థలాన్ని త్యాగరాజుకు విక్రయించాడు. మునుస్వామి ఐదు నెలలు కరెంటు బిల్లు కూడా కట్టకపోవడంతో కనెక్షన్ కట్ చేశారు. ఈ క్రమంలో త్యాగరాజు కూల్‌డ్రింక్ షాపును ఖాళీ చేసి స్థలాన్ని తమకు అప్పగించాలని మునుస్వామికి తెలిపారు. వారు స్థలాన్ని ఖాళీ చేయలేదు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలోనే మునస్వామి గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీ కార్యాలయానికి వచ్చాడు. ఆ స్థలం ఖాళీ చేస్తే తనకు బతుకుదెరువు పోతుందని, పెట్రోల్ పోసుకుంటానని బెదిరించాడు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి న్యాయం చేయాలని పిచ్చాటూరు పోలీసులకు సూచించారు.

సేవా లోపానికి పరిహారం చెల్లించండి

తిరుపతి లీగల్ : సేవా లోపానికి పాల్పడిన హెచ్‌పీ కంపెనీ లాప్ టాప్ యాజమాన్యం, విజయ్ సేల్స్ యాజమాన్యం కలిసి ఫిర్యాదికి పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. తిరుపతి ఎస్‌టీవీ నగర్‌కు చెందిన పీకే లక్ష్మీగణేష్ 2021లో విజయ్ సేల్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్రాంచ్ ఆఫీస్‌లో గేమింగ్ లాప్ టాప్ కొన్నాడు. కొన్ని రోజుల తర్వాత అది పనిచేయలేదు. దీంతో అతను తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశాడు. వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు స్నేహలత రెడ్డి, సభ్యులు నాగ శశిధర్ రెడ్డి విచారణ చేసి ఫిర్యాదికి ఆ లాప్ టాప్ విలువ రూ.1,41,51,000 చెల్లించాలని లేదా కొత్త ల్యాప్ టాప్ ఇవ్వాలని తీర్పు చెప్పారు. సేవా లోపానికి రూ.50 వేలు, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.5 వేలను 45 రోజుల్లోపు చెల్లించాలని పేర్కొన్నారు.

సాకంకు వేమన సాహితీ పురస్కారం సముచితం



సాకం నాగరాజుకు సత్కారం

తిరుపతి కల్చరల్: విద్యార్థులకు సాహిత్యాన్ని అందిస్తూ విజ్ఞానం పెంచేందుకు కృషి చేస్తున్న సాకం నాగరాజుకు వేమన సాహితీ పురస్కారం ఇవ్వడం సముచితమని ప్రముఖ రచయిత్రి ఓల్గా తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం జరుపుకున్నారు. తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేస్తున్న సాకం నాగరాజుకు వేమన సాహితీ పురస్కారం అందజేసి సత్కరించారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంచాలకుడు పీసీ.వెంకటేశ్వర్లు, రాజా చంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్గాప్రసాద్, న్యాయవాది మట్టా పురుషోత్తంరెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు తమటం రామచంద్రారెడ్డి, మల్లేశ్వరరావు, మన్నవ గంగాధర ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, అంకమనాయుడు, ఆచార్య కిరణ్ క్రాంతి చౌదరి పాల్గొన్నారు.

యువతకు ధ్యాన్‌చంద్ ఆదర్శనీయం



స్పోర్ట్స్ టార్చ్‌తో ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్



క్రీడాకారులను అభినందిస్తున్న క్రీడా ప్రతినిధులు

తిరుపతి సిటీ : క్రీడారంగానికి వన్నెతెచ్చిన మహనీయుడు ధ్యాన్‌చంద్ అని, ఆయన జీవితం యువతకు ఆదర్శనీయమని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా గురువారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో స్పోర్ట్స్ టార్చ్‌ను వెలిగించి ర్యాలీ నిర్వహించారు. అలాగే మహిళా వర్సిటీలోనూ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

సంస్కృత వర్సిటీలో..

జాతీయ సంస్కృత వర్సిటీలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ విద్యార్థులు, అధికారులు, క్రీడా భారతి సభ్యులు వాక్థాన్ 3.0 పేరుతో ర్యాలీ నిర్వహించారు. పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

తిరుపతి కల్చరల్: రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు తిరుపతి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రశంసా పత్రాలు, మెడల్స్, పతకాలు అందజేసి అభినందించారు. సుమారు 200 మంది క్రీడాకారులకు ఒలింపిక్ స్టేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అల్పాహారం అందజేశారు. తిరుపతి ఒలింపిక్ స్టేషన్ కార్యదర్శి శ్రీధర్, డీఎస్‌డీవో సయ్యద్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే స్టార్టప్స్‌పై అవగాహన ఉండాలి

తిరుపతి సిటీ : ఆధునిక ప్రపంచంలో విద్యార్థి దశ నుంచే ఇన్నోవేషన్, స్టార్టప్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. ఎస్వీయూ సెనేట్ హాల్‌లో గురువారం రూసా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కోసం ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవుట్ రీచ్ ప్రోగ్రాం ఇన్ స్కూల్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భావిభారతావనిలో విద్యార్థి దశ కీలకమని, నూతన ఆవిష్కరణలు, స్టార్టప్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, రూసా కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ రమాశ్రీ, ఉషారెడ్డి, సీఈవో వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

టాటా మోటార్స్ ఎలక్ట్రికల్ కారు ఆవిష్కరణ



కార్లను ప్రారంభిస్తున్న ఆర్టీవో ఆదినారాయణ

తిరుపతి కల్చరల్: విజయభారతి ఆటో మొబైల్స్ షోరూంలో గురువారం సరికొత్త టాటా మోటార్స్‌వారి రెండు కరు డాట్ ఈవీ ఎలక్ట్రికల్ కార్లను జిల్లా రవాణా శాఖ అధికారి ఆదినారాయణ విడుదల చేశారు. షోరూం అధినేత ఎస్.వెంకటరామన్ మాట్లాడుతూ కొత్త కార్లలో 45 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ, 502 కిలోమీటర్ల డ్రైవర్ జ్, 55 కేడబ్ల్యూ హెచ్ బ్యాటరీ 585 కిలోమీటర్ల డ్రైవర్ రేంజ్ సదుపాయం ఉందన్నారు. అంతేకాక 6 ఎయిర్ బ్యాగ్‌లు, అడాస్ లెవెల్ 2 టెక్నాలజీ, పనారోమిక్ సన్‌రూఫ్ వాయిస్ అసిస్టెడ్, హార్మాన్ సౌండ్ సిస్టమ్, 360 డిగ్రీ 3డీ సోరౌండ్ వ్యూ కెమెరా, కొత్త ఫ్లష్ హ్యాండిల్స్ వంటి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. 6 వేస్‌లో సర్దుబాటు పవర్ డ్రైవర్ సీటు, వెంటిలేటెడ్ సీట్లు, 3 డ్రైవింగ్ మోడల్స్, వెనుక ఏసీ వెంట్లు ఉన్నాయని, 15 నిమిషాల పాస్ట్ చార్జింగ్‌తో 150 కిలోమీటర్ల ప్రయాణించే సౌలభ్యం ఉన్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టాటా కస్టమర్ కేర్ విభాగాధిపతి హరివెంకటేష్, ఎస్‌బీఐ తిరుపతి రీజియన్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన బి.హరిబాబుకు ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ గురువారం తీర్పు చెప్పారు. హరిబాబు 2016లో తిరుపతి మాధవనగర్‌కు చెందిన నరసింహులు వద్ద రూ.98 వేలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించే క్రమంలో 2018లో ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. బాధితుడు కోర్టులో కేసు దాఖలు చేశాడు. కేసును విచారించిన జడ్జి నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.1.5 లక్షలను నరసింహులుకు చెల్లించాలని ఆదేశించారు.

ఎస్వీయూలో వృక్షాల కూల్చివేత దారుణం

తిరుపతి సిటీ : ఎస్వీయూలో పచ్చదనం, పర్యావరణానికి హాని కలిగించే విధంగా అధికారులు వృక్షాలను కూల్చివేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. వారు గురువారం రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెట్టు–పచ్చదనం, పరిశుభ్రత అంటూ అధికారులు గొప్పలు చెబుతూ చెట్లను నరికివేయడం దారుణమన్నారు. తొలగించిన వృక్షాల స్థానంలో మొక్కలను నాటాలని కోరారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్‌తో మందు పిచికారీ

తిరుపతి తుడా: నగరంలో దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో డ్రోన్లతో మందు పిచికారీ చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరంలో కొంత కాలంగా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇటీవల సాక్షి పరిశీలన చేసి పలు విషయాలను వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన కమిషనర్ మౌర్య తిరుపతిలోని ఖాళీ స్థలాలు, మురుగు కూపాలపై సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్ద మొత్తంలో చెత్త డంప్ అవుతున్న 32 ప్రాంతాలను గుర్తించి డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేయాలని సూచించారు. దీంతో రెండు రోజులుగా డ్రోన్ తో ట్రయల్ రన్ చేపట్టారు. ఈ నెల 31 నుంచి పూర్తిస్థాయిలో పిచికారీ చేపట్టనున్నారు.

స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాలులో స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన స్మార్ట్ సిటీ 35వ బోర్డు మీటింగ్ నిర్వహించారు. బోర్డు డైరెక్టర్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తుడా ఇన్‌చార్జ్ వీసీ వెంకటనారాయణ, రామచంద్రారెడ్డి, రమాశ్రీ, ఈ అండ్ సీ బాలకృష్ణారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుపతిలో యాత్రికులు, ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్ఈ మోహన్, జీఎం చంద్రమౌళి, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఎస్పీ నాగభూషణ రావు, డీఎస్పీలు వెంకటనారాయణ, రామకృష్ణ ఆచారి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.